రైల్వేగేటు మూసివేత పొడిగింపు

నవీపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 188 నెంబర్ గల ప్రధాన రైల్వే గేటు మూసివేతను జనవరి 1వరకు పొడిగించామని దక్షిణ మధ్య రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. రైలు పట్టాల మరమ్మతుల్లో భాగంగా నవీపేట ప్రధాన రైల్వేగేటును ఈ నెల 26 నుంచి 30వరకు మూసివేయాలని నిర్ణయించిన విషయం విదితమే. అయితే గేటు వద్ద అదనపు పనులు చేపట్టనున్నందున జనవరి 1వ తేదీ అర్ధరాత్రి వరకు పొడిగించామని వాహనదారులు సహకరించాలని శ్రీనివాస్ కోరారు.



ఏటా పెరుగుతున్న నేరాలు!



- అదుపునకు ప్రయత్నాలు చేస్తున్నా కనిపించని ఫలితం
- నేరాలను తగ్గించేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం
- నేరాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్నాం
- ఇన్‌చార్జి పోలీసు కమిషనర్ సింధూశర్మ

నేరాల సంఖ్య ఇలా..
2022 సంవత్సరంలో 918
2023 సంవత్సరంలో 980
2024 సంవత్సరంలో 1185

ఎఫ్ఐఆర్‌లు ఇలా..
2022 సంవత్సరంలో 7872
2023 సంవత్సరంలో 8635
2024 సంవత్సరంలో 8745

ఖిల్లా, డిసెంబరు 29: జిల్లాలో పకడ్బందీ ప్రణాళికలతో పోలీసు శాఖ నేరాల అదుపునకు ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. రోజు రోజుకూ నేరాల సంఖ్య పెరుగుతూనే ఉంది. గతేడాది కంటే ఈ ఏడాది నేరాల సంఖ్య పెరిగినట్లు వార్షిక నేరాల నివేదిక ద్వారా తెలుస్తోంది. 2022 సంవత్సరంలో 7872 ఎఫ్ఐఆర్‌లు, 2023 సంవత్సరంలో 8635 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా ఈ ఏడాది 8745 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ముఖ్యంగా 2022, 2023 సంవత్సరాల కంటే ఈ ఏడాది అత్యాచారాలు, కిడ్నాప్‌లు, అత్యాచార యత్నాలు, దోషపూరిత హత్యలు, గాయాలపాలైన కేసుల సంఖ్య పెరిగింది. హత్యల సంఖ్య మాత్రం తగ్గింది. ముఖ్యంగా సైబర్ నేరాలు, వైట్‌కాలర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. ఈ ఏడాది ఎస్సీ, ఎస్టీ కేసులు సైతం పెరిగాయి. 2023తో పోల్చితే ఈ ఏడాది 34 పోక్సో కేసులు పెరిగాయి.

నేరాలను తగ్గించేందుకు చర్యలు..

: ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ

నేరాల నియంత్రణ కోసం అవగాహన కార్యక్రమాలను నిర్వహించి నేరాల సంఖ్యను తగ్గించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి పోలీసు కమిషనర్ సింధూశర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కమాండ్ కంట్రోల్ హాల్‌లో ఆదివారం వార్షిక నివేదికను విడుదల చేశారు. ఈ ఏడాది సైబర్ నేరాల బారిన పడిన వారి సంఖ్య పెరిగిందన్నారు. 2022లో 192కేసులు నమోదు కాగా, 2023లో 294 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది 376 కేసులు నమోదు అయినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది 3.20 శాతం రోడ్డు ప్రమాదాలు పెరిగినట్లు తెలిపారు. గతేడాది రోడ్డు ప్రమాదాల్లో 337మంది మృతి చెందగా ఈ ఏడాది 335 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారు. గతేడాది కంటే ఈ ఏడాది హత్యలతో పాటు వివిధ నేరాలు చేసిన వారి సంఖ్య తెలిపారు. వీటిలో కిడ్నాప్‌లు, అత్యాచారాలు, హత్యాచార యత్నాలు పెరిగినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేశామన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది డ్రంకెన్‌డ్రైవ్ కేసులను తగ్గించగలిగామన్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా మొత్తం ఆరు హత్య కేసులు నమోదు కాగా వాటిని ఛేదించి నిందితులను అరెస్టు చేశామన్నారు. ఈ ఏడాది దొంగతనాల కేసులు పెరిగినట్లు చెప్పారు. మొత్తం జరిగిన దొంగతనాల కేసుల్లో 8కోట్ల 44లక్షల 33వేల 882 దొంగతనం జరగగా ఇందులో 2కోట్ల 2లక్షల 13వేల 464 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మహిళలపై జరిగిన దాడులు ఈఏడాది 593 కేసులు నమోదు అయినట్లు తెలిపారు. గతేడాదితో పోల్చితే ఈ 2.46 కేసులు తగ్గినట్లు చెప్పారు. ఈ ఏడాదిలో 11 గుట్కా కేసులు, 51 మట్కా కేసులు నమోదు చేశామన్నారు. గతేడాది కంటే పెరిగినట్లు తెలిపారు. పేకాటలో పట్టుబడ్డ వారిపై 518 కేసులు నమోదు చేశామన్నారు. గతేడాది కంటే రెండింతలు పెరిగాయి. గాంజ కేసులు గతేడాది కంటే తగ్గినట్లు తెలిపారు. పేదల బియ్యం అక్రమ రవాణా జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతేడాది 56 కేసులు ఉంటే ఈఏడాది 81 కేసులు నమోదయ్యాయి. అదే విధంగా అక్రమంగా ఇసుక రవాణా జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. గతేడాది 32 కేసులు నమోదు కాగా ఈఏడాది 2 కేసులు మాత్రమే పెరిగినట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కేసులు గతేడాది 97ఉంటే ఈ సారి 101 కేసులు నమోదు జరిగినట్లు తెలిపారు. మిస్సింగ్ కేసులు గతేడాది 734 ఉంటే ఈ ఏడాది 873 కేసులు నమోదు జరిగాయి. ఈ ఏడాది 18 ఏళ్ల వయసులోపు ఉన్న పిల్లల 110 మంది తప్పిపోగా ఈఏడాది 140మంది చిన్న పిల్లల తప్పిపోయిన కేసులు నమోదు అయినట్లు తెలిపారు. ప్రజలకు నేరాల నియంత్రణపై అవగాహన కల్పించామన్నారు. ఈ ఏడాది నిర్వహించిన లోక్‌అదాలత్ వల్ల 43శాతం ఉండగా గతేడాది 39 శాతం కేసులు పరిష్కరించినట్లు చెప్పారు. ఆత్మహత్యలు గతేడాది 355 నమోదు కాగా ఈ సారి 442 కేసులు నమోదు అయినట్లు వెల్లడించారు.

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ..

ఈ ఏడాది ప్రథమార్థంలో జరిగిన పార్లమెంటు ఎన్నికలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు శాఖ చర్యలు తీసుకుంది. ఎన్నికల సమయంలో అక్రమంగా నిషేధిత పదార్థాలు రవాణా జరగకుండా అన్ని చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా 32 ఎంసీసీ ద్వారా పలు కేసులను నమోదు చేశాం. 8 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేసి 7.19 కేజీల గంజాయిని, 0.297 అల్ప్రాజోలం, 451800 విలువ చేసే స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. 4438.85 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, చిత్రంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, బాజిరెడ్డి, జీవన్‌రెడ్డి, గణేష్ గుప్తా

కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకనే అక్రమ కేసులు

- మాది భయపడే రక్తం కాదు.. భయపెట్టే రక్తం
- గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి
- స్థానిక ఎన్నికల్లో గులాబీ సత్తా చాటుదాం
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- నగరంలో డప్పు వాయిద్యాలు, బతుకమ్మ, బోనాలతో కవితకు ఘన స్వాగతం

సుభాష్‌నగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకనే తనపై, కేటీఆర్‌పై కాంగ్రెస్, బీజేపీ కలిసి అక్రమ కేసులు పెడుతున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఎన్ని కేసులు పెట్టినా.. ఎన్ని నిర్బంధాలకు పాల్పడినా భయపడే ప్రసక్తి లేదన్నారు. మాది భయపడే రక్తం కాదని.. భయపెట్టే రక్తం అని అన్నారు. ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ కార్యకర్తలు నిప్పుకనికల్లా బయటకు వస్తారని అన్నారు. లిక్కర్ కేసులో జైలు జీవితం అనుభవించి విడుదలైన తర్వాత తొలిసారి ఆదివారం నగరానికి వచ్చిన ఎమ్మెల్సీ కవితకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం

మిగతా 8వ పేజీలో...

నగరంలో మానవ హక్కుల నేత మాధవరావు అంతిమయాత్ర

- పాల్గొన్న జిల్లాకు చెందిన వివిధ సంఘాల నేతలు
- శ్రద్ధాంజలి ఘటించిన మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు
- మెడికల్ కాలేజీకి మాధవరావు మృతదేహం అప్పగింత



గొర్రెపాటి మాధవరావు అంతిమయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మానవహక్కుల ఉద్యమ నేత గొర్రెపాటి మాధవరావు అంతిమయాత్ర ఆదివారం జరిగింది. నగరంలోని ఎన్ఆర్ భవన్ నుంచి ప్రధాన వీధులగుండా మెడికల్ కాలేజీ వరకు అంతిమయాత్ర నిర్వహించారు. వివిధ వామపక్షాలకు సంబంధించిన నేతలు అంతిమయాత్రలో పాల్గొన్నారు. అనంతరం గొర్రెపాటి మాధవరావు మృతదేహాన్ని విద్యార్థుల పరిశోధనార్థం మెడికల్ కాలేజీకి అప్పగించారు. మరణంలోనూ ఇలాంటి ఆదర్శాన్ని ప్రదర్శించిన గొర్రెపాటి మాధవరావు అందరికీ ఆదర్శప్రాయమని సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి పోటు సూర్యం అన్నారు. ఆదివారం ఉదయం 10గంటలకు ఆయన భౌతికకాయాన్ని స్వగృహం నుంచి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యాలయం ఎన్ఆర్‌భవన్‌కు తరలించి అక్కడ సంతాపసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఆయన జీవితమంతా అణచివేయబడుతున్న వారి గొంతుకై నిలిచాడని, బలహీనులను అణచివేస్తున్నప్పుడు రాజ్యహింస పెరుగుతున్నప్పుడు బాధితుల గొంతుకై నిలిచాడని అన్నారు. తన భౌతికకాయాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించాలని కుటుంబానికి ముందే చెప్పడం ఆయన ఆదర్శానికి నిదర్శనమన్నారు. ఇప్పటికే ఆయన నేత్రాలను లయన్స్‌క్లబ్‌కు అందజేశారని అన్నారు. భౌతికకాయాన్ని అనాటమీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ సుమలతకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుమలత మాట్లాడుతూ.. ఇంత మంది ప్రజలు వచ్చారంటే ఆయన ఎంత గొప్ప వ్యక్తో అర్థమవుతుందన్నారు. మాధవరావు కుటుంబ సభ్యులు భార్య మీనా సహాని, కూతురు మధుమిత, అన్నదమ్ములు జగన్మోహన్, లీలాప్రసాద్, శరత్‌చంద్రా,

మిగతా 8వ పేజీలో...

నత్తనడకన ఆర్వోబీ పనులు

- పనుల ఆలస్యంతో రాకపోకలకు తప్పని ఇక్కట్లు
- వంతెన దిగువ భాగంతో రోడ్డు గుంతలమయం
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు 7

నగరంలో డివిజన్ల అభివృద్ధికి కృషి

- నుడా చైర్మన్ కేశవేణు

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్ని డివిజన్‌ల అభివృద్ధికి కృషి చేస్తానని నుడా చైర్మన్ కేశవేణు అన్నారు. ఆదివారం నగరంలోని 7, 8వ డివిజన్‌లలో ప్రజల ఆహ్వానం మేరకు రోటరీనగర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు డివిజన్‌లో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. డివిజన్‌లో ఉన్న సమస్యలను ప్రజలతో చర్చించి కాంగ్రెస్ నాయకుల ప్రోత్సాహంతో వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతామన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నగరంలోని అన్ని డివిజన్‌లలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. నగరంలోని సమస్యలను టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి నగరంలోని అన్ని డివిజన్‌లలో అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. తాగునీరు, డ్రైనేజీల నిర్మాణం, బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం, విద్యుత్ సమస్యలను, అవసరమైన చోట పార్కులను నిర్మిస్తామని ఆయన తెలిపారు. నుడా చైర్మన్‌గా తన ద్వారా ప్రత్యేక నిధులతో డివిజన్‌లలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆయన వెంట 7వ డివిజన్‌లో కార్పొరేటర్‌గా పోటీ చేసిన రామర్తి గోపి, 8వ డివిజన్ కార్పొరేటర్‌గా పోటీ చేసిన రమేష్, వేణురాజ్, కిశోర్, కిరణ్, దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోటరీనగర్ కాలనీవాసులు కేశవేణును ఘనంగా సన్మానించారు.



కాలనీ వాసులతో మాట్లాడుతున్న నుడా చైర్మన్ కేశవేణు





'బాధితులకు అండగా ఉంటాం'



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

డొంకేశ్వర్, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారానికి చెందిన సాదు ల సాయికిర్తన రూ.6వేలు, నడ్కుడకు చెందిన సాయిరెడ్డి రూ.54వేలు, నికాల్‌పూర్‌కు చెందిన సంధ్యారాణి రూ.14వేల సీఎంఆర్ఎఫ్ మంజూరు కాగా ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూతనందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీసెల్ మండల అధ్యక్షుడు గణేష్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ సుమన్, సుద్ద చిన్నయ్య, నాగరాజు, మాజీసర్పంచ్ పోశన్న, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



ఎస్ఎఫ్ఐ ఆవిర్భావం సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాస్త్రీనగర్‌లో ఎస్ఎఫ్ఐ ఆవి ర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకుడు శ్రావన్‌కుమార్ ఎస్ఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. 1970 సంవత్సరంలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావించి విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందని, విద్యా ర్థులను ఐక్యం చేసి వారి సమస్యల పరిష్కరించడంలో ముందుంటుందన్నారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని, విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రను తిప్పికొడుతూ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే మూడు లక్ష్యాలను సాధించే వరకు నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. నవసమాజ నిర్మాణం తమ లక్ష్యమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాస్త్రీయ విద్యావిధానంపై అడుగులు వేసి విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్, నాయకులు రాజు, సంజయ్, చందు, కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ కాల్వలోకి దూసుకెళ్లిన క్రేన్



కాకతీయ కాలువలో నుంచి క్రేన్‌ను బయటకు తీస్తున్న మరో క్రేన్

మెండోర, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లపై జరుగుతున్న మరమ్మతు పనులను క్రేన్ సహాయంతో పనులు చేస్తున్నారు. ప్రాజెకు పైకి వెళ్ళి తిరిగి దిగువకు దిగుతున్న సమయంలో క్రేన్‌బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో కాకతీయ కాలువలోకి క్రేన్ దూసుకెళ్ళింది. క్రెన్‌డ్రైవర్ అప్రమత్తం కావడంతో క్రెన్‌లో నుంచి దూకడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. క్రేన్ కాకతీయ కాలువలో పడ్డ విషయం తెలుసుకున్న ప్రాజెక్టు అధికారులు, కాకతీయ కాలువకు నీటి ప్రవాహం తగ్గించి మరొక క్రెన్ సహాయంతో కాలువలో పడ్డ క్రేన్‌ను బయటకు తీశారు.

పొలం గట్టుపై ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్దాపూర్ గ్రామశి వారులో వ్యవసాయ భూమిలో దత్తరావు(43)మృతి చెందినట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. ప్రతీరోజు లాగే వ్యవసాయ భూమిలో పనులు చేయ డానికి వెళ్ళిన ఆయన ఆకస్మాత్తుగా గుండెపోటు రావడంతో పొలంగట్టుపై పడి మృతిచెందినట్టు ఆయన తెలిపారు. మృతుని భార్య భూమ బాయి పిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

సావిత్రిబాయిపూలే జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు

వేల్పూర్ డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): భారతదేశ మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే జయంతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని పలువురు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల అంబేద్కర్ యు వజన సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి జంబవచమన్ మాట్లాడుతూ సావిత్రిబాయి జయంతి సంద ర్భంగా తెలంగాణ రాష్ట్రంలో మహిళ ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో సావిత్రిబా ాయిపూలే జయంతిని జరపాలని విద్యాశాఖ ద్వారా విద్యాసంస్థలకు ఆదేశాలు జారీ చేయాలని వారు కోరారు. విద్యాశాఖ ప్రత్యేకమైన జీవో జారీ చేసి కొన్ని విద్యాసంస్థలకు సావిత్రిబాయిపూలే పేరు పెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అంబేద్కర్ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఐ సుభాష్‌కు సన్మానం

వేల్పూర్ డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ యూని యన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికైన వేల్పూర్ మండలం లక్కోర గ్రామా నికి చెందిన ఎంపీఐ ఊట్నూర్ సుభాష్‌ను ఆదివారం పీఆర్‌టీయూ నాయకులు ఘనంగా సన్మానించారు. తమ మండలానికి చెందిన ఎంపీఐ సుభాష్ తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వేల్పూర్ మండల పీఆర్‌టీయూ ప్రధానకా ర్యదర్శి సి.వెంకటనర్సింహరావు, మండల కాంగ్రెస్ నాయకులు చదల్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు బైరి సంపత్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, లక్కోర గ్రామ యువకులు, తదితరులు ఉన్నారు.



వేల్పూర్‌లో ఎంపీఐ సుభాష్‌ను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మున్సిపల్ ఏఈ, డీఈల నియామకమెప్పుడో?

● కుంటుపడుతున్న అభివృద్ధి



ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలోని ఇంజనీర్ శాఖలో ఏఈ, డీఈల నియామకం ఎప్పుడు చేస్తారని నాయకులు, ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. గత మూడు నెలల క్రితం సాధారణ బదిలీలలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న ఏఈ, డీఈలు వేరే చోటికి వెళ్ళిపోగా అప్పటి నుంచి ఇంజనీరింగ్ శాఖలో ఏఈ, డీఈల నియామకం జరగలేదు. దీంతో మున్సిపల్ పరిధిలో జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడుతున్నాయి. జనరల్ ఫండ్ నుంచి చేపట్టాల్సిన చిన్న చిన్న పనులు సైతం చేపట్టలేక పోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో నిజామాబాద్‌లో విదులు నిర్వహిస్తున్న డీఈ భూమేశ్వర్ వర్కింగ్ అరెంజ్‌మెంట్ బెస్‌లో వచ్చి సంతకాలను చేసి వెళ్తున్నారు. ఇలా ఎన్నాళ్లు కొనసాగుతుందని మున్సిపల్ పాలక వర్గం పదవీ కాలం నెల రోజులే ఉండడంతో వార్డులలో అభివృద్ధి పనులను చేపట్టాల్సి ఉండడంతో దిక్కుతోచని స్థితిలో కౌన్సిలర్‌లు ఉన్నారు. జిల్లా ఉన్నతాధికారులు తమ గోసను అర్థం చేసుకొని ఏఈ, డీఈలను నియమించాలని పట్టణ ప్రజలు వేడుకుంటున్నారు.

కార్మికులకు లేబర్ కార్డులు అందజేయాలి



మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి దేవరాం

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటుక బట్టిలలో పనిచేస్తున్న కార్మికులకు లెబర్‌కార్డులను అందజేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి బి.దేవరాం డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఇస్సాపల్లి గ్రామంలో ఇటుక బట్టిలో పనిచేస్తున్న కార్మికుల స్థితిగతులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఇటుక బట్టిల్లో కార్మికులుగా పనిచేస్తున్న వారికి అధార్‌కార్డు, లెబర్‌కార్డు లేక నానా అవస్థలు పడుతున్నారని, ఇటీవల లక్ష్మయ్య అనే కార్మికుడు రోడ్డు ప్రమాదంలో చనిపోవడం జరిగిందని, ఇప్పటి వరకు అధికారులు పరిశీలించిన దాఖ లాలు లేవన్నారు. స్థానికుల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారు లు నిమ్మకు నిరెత్తినట్టు వ్యవహరించడం సరైందికాదని, లక్ష్మయ్య మర ణంతో కుటుంబం రోడ్డున పడిందని, ప్రభుత్వం లక్ష్మయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఇటుక బట్టిలో పని చేస్తున్న కార్మికులకు లెబర్‌కార్డులను జారీ చేసి వారు సమస్యలను పరిష్కరిం చాలని, లేనియెడల ఉద్యమిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో సీపీఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ నాయకులు జయవరం, కిషన్, శేఖర్, ఠాకూర్, అర్వింద్, నజీర్, నితిన్, సద్దార్థ్, నిఖిల్ పాల్గొన్నారు.

ఆరుతడి పంటల సాగు జోరు



సాగు చేస్తున్న జొన్న పంట

పెద్ద కొడప్‌గల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): యాసంగి పంటల సాగుకింద మండలంలోని ఆయా గ్రామాలలో ఆరుతడి పంటల సాగు జోరుగా సాగుతోంది. పెద్ద కొడప్‌గల్ మండలం నాన్‌క మాండ్ ఏరియాలో ఉండటంతో ప్రధానంగా సాగంతా అధిక మొత్తంలో వర్షాధారంపై ఆధా రపడి ఉంటుంది. మండలంలోని ఆయా గ్రామాలలో చెరువులు తక్కు వగా ఉండటంతో రైతన్నలు ఆరుతడి పంటలకే ప్రాధాన్యం అధికంగా ఇస్తారు. దీంతో మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతన్నలు జొన్న, మొక్కజొన్న, శనగ, కంది, తెల్ల కుసుమ లాంటి పంటల సాగుకు ప్రాధాన్యం ఇస్తారు. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ బోరుబావుల వద్ద, చెరువుల కింద వరి సాగు చేసిన రైతన్నలు యాసంగి పంట కింద మాత్రం ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు.గత వర్షాకాలంలో ఆశిం చిన స్థాయిలో మండలంలో భారీ వర్షాలు కురియకపోవడంతో చెరు వులలోకి భారీగా వరదనీరు చేరలేదు. దీంతో ప్రస్తుతం చెరువులన్ని ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో వ్యవసాయ బోరుబావులలో నీరు తగ్గుతుండటంతో మండలంలోని వ్యవసాయదారులంతా ఆరుతడి పం టలకే ప్రాధాన్యం ఇస్తు ఆ పంటలనే సాగు చేస్తున్నారు. దీంతో గత సంవత్సరంతో పోలిస్తే మండలంలో ఈ సారి ఆరుతడి పంటల సాగు పెరిగింది.

ప్రహరీ లేక విద్యార్థుల ఇబ్బందులు



చుట్టు పెరిగిన పిచ్చి మొక్కలు

కోటగిరి, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల ప్రహరి లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారికి అనుకుని ఉన్న పాఠశాలకు విరామ సమయంలో విద్యార్థులు బయటకు రోడ్డుపైకి వస్తున్నారు. మరో వైపు పాఠశాల చుట్టు పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. కిటికీలకు సమాంతరంగా పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో విషపు జంతువులు పాఠశాలలోకి వచ్చే ప్రమాదముంది. మరో వైపు పాఠశాల పైభాగంలో పెద్ద గుంత ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల ప్రాంగణంలో పశువులు సంచరిస్తున్నాయి. పాలకులు స్పందించి ప్రహరి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. పిచ్చి మొక్కలను తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



బజార్‌కొత్తూర్‌లో బాధితురాలికి చెక్కును అందజేస్తున్న దృశ్యం

నందిపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బజార్ కొత్తూర్ గ్రామానికి చెందిన పల్లికొండ సుమలత అనే బాధితురాలికి ఆదివారం రూ.16వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్ అందజేశారు. ఆర్మూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పొద్దుటూరి వినయ్‌రెడ్డి ఆదేశాల మేరకు అనారోగ్యంతో బాధపడుతున్న పల్లికొండ సుమలత ఆసుపత్రి ఖర్చుల కోసం రూ.16వేల చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల మైనారిటీ అధ్యక్షుడు యుసుఫ్, చింరాజ్‌పల్లి సొసైటీ ఉపాధ్యక్షుడు తెలు నర్సయ్య, సొసైటీ డైరెక్టర్ ఆకుల లక్ష్మీనారాయణ, నాయకులు గోపు ముత్యం, రాజు, గజేందర్, చంద్రయ్య, భూమేష్, తదితరులు ఉన్నారు.

నందిపేట కిరాణ అసోసియేషన్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్ ఎన్నిక



నందిపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నందిపేట మండలం కిరాణ అసోసియేషన్ ఎన్నికలు కామారెడ్డి జిల్లాలోని మాచారెడ్డి మండలంలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో జరిగాయి. అధ్యక్షునిగా మాదస్తు చంద్ర శేఖర్ ఐదో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షునిగా పాలకుర్తి ప్రదీప్ కుమార్, కార్యదర్శిగా మాయవర్ శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా షేక్ ఉస్తోద్దిన్, కోశాధికారి ఊరటి మనోహర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా బాలకిషన్, బందం సురేందర్, మాదస్తు సాయన్న, బద్దం ప్రసాద్, కూర శ్రీనివాస్, సీహెచ్.రమేష్‌లు ఎన్నికయ్యారు.

ఘనంగా సాయి పల్లకీ సేవ

ముప్కాల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు వద్ద సాయి ఆలయంలోఏడు రోజులుగా కొన సాగుతున్న సాయి పారాయణం ఆదివారం చివరి రోజు కావడంతో సాయంత్రం పల్లకి సేవ ప్రారంభించారు. గ్రామంలో వీదివీదినా సాయి పల్లకిని ఊరేగించారు. సాయి భక్తులు భక్తీగీతాలతో చేసిన నృత్యాలు కోలాటాలతో అందరిని ఆకట్టుకున్నాయి. భక్తులు సాయిబాబాను దర్శించుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ కమిటీ సభ్యులు, సాయి సేవ సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రెంజర్లలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ముప్కాల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంజర్ల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో 1998- 99 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేనం ఘనంగా నిర్వహించారు. 25ఏళ్ళు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసుకున్న ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు ఒక చోట కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులను శాలువ, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శంభులింగేశ్వరుడి కల్యాణం

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): హరహర మహాదేవ భక్తుల శివనామస్మరణలు వేదపండితుల వేదమంత్రోశ్చరణలతో శంభులింగేశ్వరుడి కల్యాణం కమనీయంగా జరిగింది. పరమేశ్వరా భక్తులను రక్షించూ అని వేడుకుంటూ కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం నగరంలోని శంభులింగేశ్వర ఆలయంలో శివపార్వతుల మాస కళ్యాణం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు పశుపతి శర్మ, ఉమా మహేశ్వరశర్మ వేద మంత్రాలు పఠించగా అర్చకులు దేవశర్మ, వాసుదేవ శర్మ వేడుకలను జరిపారు.

సంస్కృతికి నిలయాలు.. సరస్వతి శిశు మందిరాలు



సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సూర్యనారాయణ

పెర్కిట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనం నిర్వహించారు. ఈ మహా సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ శిశు మందిర్‌లో చదవడం విద్యార్థులు, విద్యార్థినిలు చేసుకున్న పుణ్యమని, భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలు, విలువలతో 43 ఏళ్ల క్రితం 1981లో ప్రారంభమై ఆర్మూర్ చుట్టుపక్కల ప్రాంతాలలో ప్రథమ స్థానంలో నిలిచి ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించిన ఘనత శిశుమందిర్ విద్యాలయానికి దక్కుతుం దన్నారు. శిశుమందిర్ పాఠశాల క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆవిష్కరించి పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులకు, అధ్యాపకులకు అందజేశారు. ఈ సందర్భంగా 1981 నుంచి 2024 వరకు పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు, పాఠాలు బోధించిన పూర్వఅధ్యాపకులు పాల్గొని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. పాఠశాలలో అభివృద్ధి కమిటీ ఆధ్వ ర్యంలో పాల్గొన్న ప్రతీ అధ్యాపకునికి, విద్యార్థికి మెమోంటో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు లోక భూపతిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, పెద్దోళ్ళ గంగారెడ్డి, విద్యభారతి దక్షిణ మధ్యక్షేత్రం సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి సరస్వతి విద్యా పీఠం తెలంగాణ సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాస్‌రావు, రాష్ట్ర పూర్వవిద్యార్థి పరిషత్ అధ్యక్షుడు హరిస్మరణ్‌రెడ్డి, సరస్వతి విద్యాపీఠం జిల్లా కార్యదర్శి రవినాథ్, ఆర్మూర్ పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ధన్‌పాల్ వంశీకృష్ణ, సభ్యులు సరస్వతి విద్యామందిర్ అధ్యాపకులు, పాఠశాల ప్రధానాచార్యులు, అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

రైల్వేగేటు వద్ద వ్యాన్ బోల్తా



నవీపేట దర్యాపూర్ రైల్వేగేటు వద్ద బోల్తా పడిన వాహనం

నవీపేట, డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దర్యాపూర్ రైల్వేగేటు వద్ద ఆదివారం ఉదయం వ్యాన్‌బోల్తా పడింది. నిజామాబాద్ నుం చి మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు గాజు అద్దాల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ అదుపు తప్పి దర్యాపూర్ రైల్వే గేటు సమీపంలో బోల్తా పడింది. నవీపేట ప్రధాన రైల్వేగేటు మరమ్మతుల్లో బాగంగా ఈ నెల 26 నుంచి ప్రధాన గేటును మూసివేసిన విషయం విదితమే. సంబంధిత వాహన డ్రైవర్ ప్రత్యామ్నాయ మార్గం ద్వారా తమ గమ్యానికి వెళ్లాల్సి ఉండగా రైల్వేగేటు పక్కనే ఉన్న తాత్కాలిక చిన్నపాటి రోడ్డుపై వెళ్తుండగా దర్యాపూర్ గేటు సమీపంలో అదుపు తప్పి బోల్తా పడడంతో వాహనంలో ఉన్న అద్దాలు పూర్తిగా పగిలిపోయాయి. విషయంపై ఎస్ఐ వినయ్‌ని వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

బాధితులకు సాయం



నాగేంద్రనగర్‌లో చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేంద్రనగర్ గ్రామంలో ఆదివారం గ్రామానికి చెందిన బొల్లి దేవాయికి 34 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరు కాగా కాంగ్రెస్ నాయకులు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరీకి కృషి చేసిన రాష్ట్ర కో-ఆపరేటీవ్ యూనియన్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామంలోని కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

కోటగిరి,డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని పోతంగల్, హంగర్గ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆదివారం ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులైన లబ్దిదారులను సర్వేలో నమోదు చేయాలని సూచించారు. సర్వేలో ఎలాంటి తప్పులు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



ట్రోఫీ అందుకుంటున్న విద్యార్థులు

మెండోర., డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కరాటే చాంపి యన్‌షిప్ పోటీల్లో వెల్కటూర్ లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు శ్రీనాథ్ జస్వంత్‌లు పోటీల్లో పాల్గొని విజయం సాధించారని పాఠశాల కరస్పాం డెంట్ అజ్మత్‌పాషా తెలిపారు. ఈ సందర్భంగా 27, 28తేదీల్లో ముంబాయిలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కటస్ కుంతె ఫైటింగ్ విభా గంలో శ్రీనాథ్ సిల్వర్ పతకంతో, జస్వంత్ రజత పతకం గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్‌తో పాటు ప్రశంసాపత్రం ట్రోఫీ అందజేశారు. జాతీయస్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్ వెల్కటూర్ ఉపాధ్యాయుల బృందం అభినందించారు. విద్యార్థులు మండల స్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో, జాతీయస్థాయి కరాటే పోటీల్లో కూడా ప్రతిభ కనబరిచి విజయం సాధించడానికి కృషి చేసిన అజ్మత్‌పాషా, అవినాష్, శివానిలకు పలువురు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎడపల్లిలో రోడ్డు ప్రమాదం



చికిత్స పొందుతున్న బాలుడు

ఎడపల్లి, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడేళ్ళ బాలుడికి తీవ్రగాయాలు కాగా అతని తల్లిదండ్రులకు స్వల్పగాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎడపల్లి మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ప్రవంతి అనే ఉపాధ్యాయురాలు విధులు నిర్వహించుకుని భర్త శేఖర్ తన మూడేళ్ళ కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై బ్రాహ్మణపల్లి గ్రామానికి వెలుతుండగా అదే సమయంలో కోటగిరి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న నాగరాజు తన విధులు పూర్తి చేసుకుని బుల్లెట్ వాహనంపై నిజామాబాద్‌కు తిరిగి వెలుతుం డగా ఉపాధ్యాయురాలు వెలుతున్న వాహనాన్ని బుల్లేట్ వాహనం డీ కొట్టింది. దీంతో ఉపాధ్యాయురాలు ప్రవంతి ఆమె భర్త శేఖర్‌కు స్వల్ప గాయాలు కాగా తమ కుమారుడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆ బాలుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

బోధన్‌రూరల్,డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి బైపాస్‌లో విద్యుత్ షాక్‌కు గురై అర్మాన్ అనే యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. బైపాస్ రోడ్డులోని ఓ స్వీట్ షాప్‌పై ఆదివారం మధ్యాహ్నం అర్మాన్ అనే యువకుడు ఫైన్ బోర్డులు ఫిట్టింగ్ చేస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు తగిలి షాక్ కొట్టిందని స్థానికులు తెలిపారు. విద్యుత్ షాక్‌తో గాయాల పాలైన యువకుడిని స్థానికులు చికిత్స నిమిత్తం వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయాలపాలైన యువకుడు బీహార్‌కు చెందిన అర్మాన్ బోధన్‌లో పని చేస్తూ నివాసం ఉంటాడు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షులు

బోధన్‌రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్ అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని బీడీ ఖార్ఖానాలో బీడీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ప్రభుత్వం బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. బీడీ కార్మికులకు పింఛన్‌లను పెంచి ఇవ్వాలన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రజలు బీఆర్ఎస్‌కు ఓట్లు వేసి మోసపోయారని, కాంగ్రెస్‌లకు ఓట్లు వేసి గెలిపించారన్నారు. వంద రోజుల్లో బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలను, వాగ్దాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. బీడీ కార్మికులపై ఆధారపడి జీవించే ప్రతి ఒక్కరికి 4వేల రూపాయల జీవన భృతిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం నాయకులు భాగ్య, లక్ష్మి, రెహానా బేగం, బీపాషా బేగం, మౌనిక, బీడీ కార్మికులు తదితరులున్నారు.

లింకు నొక్కారో.. ఖాతా ఖాళీ

భక్తి



మహా పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

అయ్యప్ప దీక్షతో తొలగనున్న కష్టాలు

● మఠాధిపతి సోమలింగశివాచార్యులు



సోమలింగ శివాచార్యులను సన్మానిస్తున్న దృశ్యం

బిచ్కుంద, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నియమ నిష్టలతో చేపట్టిన దీక్షలతో సంసార జీవన సాగరంలో ఎదురయ్యే కష్టాలు ఖచ్చితంగా తొలగిపోతాయని బిచ్కుంద సద్గురు బండయప్ప స్వామి మఠాధిపతి సోమలింగ శివాచార్యులు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన చిల్లెల శ్రీనివాస్ 18 సార్లు అయ్యప్ప మాల ధరించిన సందర్భంగా శనివారం రోజు అంగరంగవైభవంగా మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. భారీ సెట్టింగ్‌లో గణపతి సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వామి విగ్రహం మూర్తులను ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు పంచామృతంతో అయ్యప్పకు అభిషేకాలు మంత్రోశ్చరనల మధ్య పూజా కార్యక్రమాలు కమనీయంగా నిర్వహించారు. మధ్యాహ్నం వేల మంది భక్తులకు మహా అన్నదాన ప్రసాద వితరణ రాత్రి అల్పాహారాన్ని ఏర్పాట్లుచేశారు. పడిపూజ సందర్భంగా అయ్యప్ప స్వాములు భక్తి భజన పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి. మఠాధిపతి మాట్లాడుతూ నియమనిష్టలతో 41 రోజుల పాటు దీక్ష కాలంలో ఒక పూట భిక్ష స్వీకరించడం వల్ల ఆరోగ్యంతో ఉన్నచిన్న చిన్న సమస్యలు తొలగిపోయి ఆరోగ్యవంతమైన పరిపూర్ణత లభించి మానసిక ప్రశాంతత తలపిస్తుందన్నారు. దీక్ష నియమాలతో మనలో ఉన్న చెడు అలవాట్లు కూడా దూరమవుతాయని దీక్ష విరమణ అనంతరం కూడా అందరూ అదే నియమ నిబంధనలను పాటిస్తు నడుచుకోవాలని మఠాధిపతి సోమలింగశివాచార్యులు సూచించారు. అర్థరాత్రి అయ్యప్ప స్వామి 18 మెట్ల పడిపూజ మెట్ల కర్పూర జ్యోతులను వెలిగించి అంగరంగవైభవంగా భక్తులకు ఆకర్షించేలా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జుక్కల్ నియోజకవర్గంలోని మండలాలతో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి, బోధన్ నారాయణఖేడ్ నియోజకవర్గాల్లోని అయ్యప్ప స్వాములు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

» రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
» అవగాహన లేక కొందరు.. ఆశతో మరికొందరు
» ఇప్పటికే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న వాళ్లు కోకొల్లలు
» స్వీయ జాగ్రత్తలతో సైబర్ నేరాల నియంత్రణ



సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బోధన్‌రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నీ బ్యాంక్ అకౌంట్ బ్లాక్ అయింది.. నీ మొబైల్‌కు ఓటీపీ వచ్చింది చెప్పండి అంటూ బ్యాంకు అధికారుల పేరుతో తెలియని వ్యక్తులు కాల్ చేస్తుంటారు. మరి కొందరేమో మీరు లక్కీ డ్రాకు ఎపికయ్యారు. మేము అడిగే అతి సులభమైన రెండు ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి ఆ తర్వాత మీ మొబైల్‌కు వచ్చే ఓటీపీ చెప్పండి ఇలా రకరకాల వాయిస్ మెసెజ్‌లు, మెసెజ్‌లు లింకు మెసెజ్‌లు ఓపెన్ చేయండి అంటూ ప్రతీ రోజు తరుచు ఫోన్‌లలో ఫేక్ కాల్స్ వస్తుంటాయి. తెలిసి తెలియక లింక్ నొక్కారో ఖాతా ఖాళీ అవుతుంది. ఇటీవల ఇలాంటి కాల్స్ ఎక్కువయ్యాయి. పొరపాటున వారి మాటలు నమ్మి ఓటీపీలు చెప్పారో నిజంగానే మీ బ్యాంకులో ఉన్న కాసులు ఖాళీ అవ్వాల్సిందే. ఏం జరుగుతుందో తెలుసుకుని తేరుకునేలోపే సైబర్ నేరగాళ్లు మన ఖాతాలో డబ్బులను మాయం చేస్తున్నారు. సైబర్ నేరగాళ్లు ఇటీవల కాలంలో ఒక అడుగు ముందుకు వేసి ఖాతాలో డబ్బులను మాయం చేయడమే కాకుండా బ్యాంకు ఖాతాతో లింకు అయిన మొబైల్ నెంబర్, ఆధార్ నెంబర్‌ను బ్లాక్ చేస్తున్నారు. రోజురోజుకు సాంకేతిక అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఇలాంటి సైబర్ నేరగాళ్ల తీవ్రత కూడా అంతేస్థాయిలో పెరుగుతుండడం ఆందోళనకు గురి చేస్తుంది. ఒక వైపు పోలీసులు, మరో వైపు స్వచ్ఛంద సంఘాలు సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు ఊరూరా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న రోజుకు ఒకటి చొప్పున సైబర్ నేరాలు జరుగుతూనే ఉన్నాయి. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో నిర్లక్ష్యరాసులు పడుతున్నారు అనుకుంటే పొరపాటే. అన్ని తెలిసి చదువుకున్న వారు వీరిలో ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకు ఉద్యోగులు కూడా ఉండడం గమనార్హం.

● అవగాహన లేక కొందరు.. అత్యాశతో మరికొందరు

పెరుగుతున్న సాంకేతికత అందరి చేతుల్లోకి స్మార్ట్ ఫోన్‌లు అందుబాటులోకి రావడం వాటికి తగ్గట్టుగా తక్కువ రేటుకు ఇంటర్నెట్ సేవలు అందుతుండడంతో ఎటు నుంచి ఏ సైబర్ కేటుగాడు మోసానికి పాల్పడతాడో అర్థం కాని పరిస్థితి. మారుమూల పల్లెల్లోని చిరు దుకాణాల నుంచి కార్పొరేట్ స్థాయి షాపింగ్‌లు, సూపర్ మార్కెట్‌లలో సైతం కొనుగోలు, అమ్మకాలకు చెందిన ప్రతీ లావాదేవీలు యూపీఐ అకౌంట్ ద్వారా చేస్తున్నారు. ఆర్థిక లావాదేవీలు చేస్తున్న ప్రతీ యూపీఐ చెల్లింపులన్నీ ప్రైవేటుకు చెందింది కావడంతో తమ వ్యక్తిగత సమాచారం వాళ్ల వద్ద ఉండిపోతుంది. అదే అదనుగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతూ మోసాలకు తెర లేపుతున్నారు. మెసెజ్, వాట్సప్‌ల ద్వారా తప్పులు లింకులు షేర్ చేస్తున్నారు. తెలిసి తెలియక వాటిని నొక్కిన వెంటనే మన ఖాతాలోని డబ్బంత మాయమైపోతుంది. వీటితో పాటుగా కొంతమంది నకిలీ వెబ్‌సైట్‌లను క్రియేట్ చేస్తుండడంతో స్టార్ట్‌లకు వచ్చే బల్క్ వెబ్‌సైట్‌లలో నకిలీవి ఏవో అసలివి ఏవో తెలియక ప్రజలు మోసాలకు గురవుతున్నారు. ఇలాంటి సైబర్ మోసంలో చిక్కుకునే వాళ్లల్లో కొంతమంది ఏం తెలియని వారు ఉండగా మరికొందరు అత్యాశతో రాత్రికి రాత్రే కోటీశ్వర్లుగా ఎదగాలని ఆత్యాశతో నిండ మునుగుతున్నారు. కొందరు ఆదాయ పన్నును తప్పించుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తూ మోసాల బారిన పడిపోతున్నారు. కొంతమంది యువత ఆన్‌లైన్ గేట్ మోజులో పడి ఖాతాలను గుల్ల చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ గేమ్‌లలో మొదట గెలిచినట్లు అవకాశం కల్పించి రెట్టింపు డబ్బులు చెల్లించి పూర్తిగా నమ్మించిన తర్వాత ఖాతాలో ఉన్న డబ్బులు మొత్తం మాయం చేస్తున్నారు. ఇటీవల ఇలాంటి ఘటనలు బోధన్ పట్టణంతో పాటు మండలంలో అనేక రకాలుగా జరిగాయి. యువకులు పెద్దఎత్తున తమ డబ్బులను పోగొట్టుకుని పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ఇలా జాగ్రత్తలు పాటించాలి

- సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి.
- వెబ్‌సైట్‌లు అసలివా, నకిలివా అని తెలుసుకునేందుకు ముందుగానే వాటిని నిర్ధారించుకోవాలి.
- మొబైల్ ఫోన్‌లకు వచ్చే లింక్‌లు తొందర పడకుండా జాగ్రత్తగా గమనించి ఓపెన్ చేయాలి.
- థర్ట్ పార్టీ అప్లికేషన్‌లు ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయొద్దు.
- బహుమతి వచ్చిందని, లోన్ వచ్చిందని ఎస్ఎంఎస్‌లు వస్తే నమ్మి మోసపోవద్దు.
- అపరిచితులకు తమ ఖాతా నెంబర్లు, ఓటీపీలు ఇవ్వకుండా ఉండాలి.
- యూపీఐల ద్వారా డబ్బులు చెల్లించే ఖాతాల్లో వీలైనంత మేరకు తక్కువ డబ్బులను ఉంచుకోవడం శ్రేయస్కరం.
- ప్రతీ పోలీస్ స్టేషన్‌లో సైబర్ వారియన్‌లను ప్రభుత్వం నియమించింది. వారిని సంప్రదించి అనుమానం నివృత్తి చేసుకోవచ్చు.

వ్యక్తిగత సమాచారం షేర్ చేయొద్దు

● వెంకట నారాయణ, పట్టణ సీఐ, బోధన్



అపరిచిత వ్యక్తులు పంపే లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయొద్దు. అదేవిధంగా ఎవరైనా ఫోన్‌చేసి ఆధార్ నెంబర్, బ్యాంక్ అకౌంట్ నెంబర్, ఓటీపీ నెంబర్ అడిగితే ఎవరికి కూడా షేక్ చేయొద్దు. సైబర్ నేరగాళ్లు మోసం చేసేందుకు అనేక రూపాల్లో స్మార్ట్ ఫోన్ ద్వారా మోసం చేసేందుకు సిద్ధంగా ఉంటారు. అటువంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

నత్తనడకన ఆర్‌వోబీ నిర్మాణ పనులు

డిచ్‌పల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండలంలోని బర్ధీపూర్ శివారులో గల మాధవనగర్ రైల్వేగేట్ ఆర్‌వోబీ వంతెన నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్న ఆర్ అండ్‌బీ అధికారులు కానీ, రైల్వేశాఖ అధికారులు కానీ పట్టించుకోక పోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వంతెన నిర్మాణం పనులు ఈ ఏడాది జూన్ మాసంలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధుల మాటలు నీటిమూటలు అయ్యాయి. నిజామాబాద్‌కు చెందిన ఎంపీ ధర్మపురి అర్వింద్ వంతెన నిర్మాణం పనులను ఆకస్మికంగా తనిఖీ చేసి వెంటనే పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వంతెన నిర్మాణం పనుల ఆలస్యంతో వాహనదారులకు నిత్యం ఇక్కట్లు తప్పడం లేదు. అంతే కాకుండా వంతెన నిర్మిస్తున్న దిగువ భాగంతో రోడ్డు గుంతలమయం కావడంతో ద్విచక్ర వాహనదారులు, కార్లు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే రోడ్లు భవనాల శాఖ అధికారులు నత్తనడకన సాగుతున్న వంతెన నిర్మాణాలు వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

ఫోకస్







డిచ్‌పల్లి- మాధవనగర్ వద్ద ఆర్‌వోబీ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్న దృశ్యం

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు పోసానిపేట్ పాఠశాల విద్యార్థినులు

రామారెడ్డి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు రామారెడ్డి మండలకేంద్రంతోపాటు పోసానిపేట్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు, విద్యార్థినులు నేటి నుంచి జనవరి 2వ తేదీ వరకు వరంగల్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి ఫుడ్‌బాల్, ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఆనంద్, శ్రీనివాస్ తెలిపారు. పోసానిపేట్ ఉన్నత పాఠశాల ఐదుగురు విద్యార్థినులు నేహ, నిహారిక, మేఘన, రుతిక, రసజ్ఞలు ఎంపికయ్యారని, జిల్లా బాలికల జట్టుకు కెప్టెన్‌గా నేహ, కోచ్‌గా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నరేష్‌రెడ్డి వ్యవహరిస్తారని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు.



రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కి బయలుదేరిన రామారెడ్డికి చెందిన విద్యార్థులు

బోధన్‌లో సినిమా షూటింగ్ సందడి

● కమ్మ సంఘంలో బుల్లెట్ రెడ్డి సినిమా చిత్రీకరణ



కమ్మ సంఘంలో ఫైటింగ్ చిత్రీకరణ

బోధన్‌రూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణ శివారులోని కమ్మ సంఘంలో ఆదివారం బుల్లెట్ రెడ్డి సినిమా షూటింగ్ చిత్రీకరణ జరిగింది. సినిమా షూటింగ్ జరగడంతో సందడి నెలకొంది. హీరో, హీరోయిన్‌లు, సినిమా ఫైటింగ్ చిత్రీకరణ సన్నివేశం జరుగుతుండడంతో అటుగా వెళ్లే ప్రజలు, ప్రయాణికులు ఉత్సాహంగా షూటింగ్‌ను తిలకించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతమంతా సందడి నెలకొంది. బుల్లెట్ రెడ్డి సినిమా హీరో ఆదినారాయణ, హీరోయిన్ మేఘ, విలన్‌లతో పోరాట దృశ్యాలు చిత్రీకరించారు. ఫైట్ మాస్టర్ ఖయ్యూం ఆధ్వర్యంలో ఫైటింగ్ షూట్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన విలన్‌లు ప్రత్యేక పాత్రలో కనిపించారు. ఫైటింగ్ చిత్రీకరణ ఉత్సాహంగా షూటింగ్ నిర్వాహకులు నిర్వహించారు. సిని పరిశ్రమకు బోధన్‌లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా సినిమా హీరో ఆదినారాయణ మాట్లాడుతూ సినిమా షూటింగ్‌కు పర్మిషన్ ఇచ్చిన కమ్మ సంఘం ప్రతినిధులకు, బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



సినిమా షూటింగ్‌కు వచ్చిన చిత్ర బృందం



సినిమా షూటింగ్ సందడి

ఆ జేసీబీ జాడెక్కడ?

● రెవెన్యూ అధికారుల కన్ను గప్పి దుర్కి గ్రామంలో తప్పిపోయిన జేసీబీ, టిప్పర్
● రోజులు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు



దుర్కి గ్రామంలో సీజ్ చేసిన టిప్పర్, జేసీబీ (ఫైల్)

నసురుల్లాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్కి గ్రామంలో ఈ నెల 26వ తేదీన పక్కా సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు అక్రమంగా మొరం తవ్వుతున్నారన్న సమాచారంతో టిప్పర్, జేసీబీని పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న సమయంలో వాహనాలు, డ్రైవర్లు తప్పించుకున్నారని కట్టు కథలు చెబుతూ రెవెన్యూ అధికారులు ఈ విషయాన్ని దాటవేశారు. అయితే ఈ విషయం జరిగి నాలుగు రోజులైనా కూడా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కనీసం దాని జాడ ఎవరు పట్టుకోవడం లేదంటూ మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. కేవలం అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మొరము తరలిస్తున్న జెసిబి, టిప్పర్, డ్రైవర్లతో సహా పారి పోయారని పలువురు చర్చిస్తే ,అధికారుల కనుసన్నాల్లోనే మామూళ్ల మత్తులో ఉండి, రెవెన్యూ, పోలీస్ అధికారులు వాహనాలను పట్టుకోవడం లేదని మరికొందరు ఆరోపిస్తున్నారు.. ఒక చిన్న మొబైల్ ఫోన్ తప్పిపోతేనే గంటల వ్యవదిలో పట్టుకుంటున్న పోలీసులు ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న జేసీబీ, టిప్పర్లను పట్టుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. ఈ కారణంగా అధికారులు మాముల మత్తులో ఉండి మొరం తరలిస్తున్న జేసీబీ టిప్పర్లను తప్పించారని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీధిలో నిర్లక్ష్యం వహించకుండా మొరం టిప్పర్లను పట్టుకోవాలని అక్రమంగా తరలిస్తున్న మొరం వ్యాపారాన్ని అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

● సెలవు దినం కూడా వదలని మొరం మాఫియా

నసురుల్లాబాద్ మండలంలోని మైలారం, దుర్కి, బస్వాయిపల్లి ఆయా గ్రామాల్లో మొరం దందా యథేచ్ఛగా కొనసాగుతుంది. కాగా సెలవు దినం ఆదివారం రోజు ఏ అధికారులు కూడా రారు.. మమ్మల్ని ఏం చేయరు అన్న ఉద్ధేశంతో మొరం మాఫియా పెట్రేగిపోతుంది. స్పందించాల్సిన రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ గుట్టలు మాయం చేస్తున్న మొరం మాఫియాపై కన్నెత్తి చూడకపోవడం గమనార్హం

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

● రక్షణ లేకుండా తక్కువఎత్తులో నిర్మాణం ● మూగ జీవాలకు శాపంగా మారిన వైనం
● భయాందోళనలో రైతులు, ప్రజలు ● పట్టించుకోని విద్యుత్ అధికారులు



కొక్కొండ రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

ఎల్లారెడ్డి, డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరా సౌకర్యం కోసం మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కాని పలు గ్రామాల్లో కిందకు ఏర్పాటు చేయడంతో పాటు కంచె ఏర్పాటు చేయకపోవడంతో విద్యుత్ ప్రమాదాలకు ట్రాన్స్‌ఫార్మర్లు నేలవుగా మారాయి. తక్కువ ఎత్తులో ఉండటంతో మూగ జీవాలు వాటికి తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడుతున్నాయి. ముఖ్యంగా మూగ జీవాలకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండటం, వైర్లు కిందకు వేలాడటం లాంటివి శాపంగా మారాయి. ఎల్లారెడ్డి మండలంలోని కొక్కొండ గ్రామానికి వెళ్లే రహదారి పక్కన తక్కువ ఎత్తులో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులకు మేతకు వెళ్లే మూగజీవాలకు ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల మండలంలో గాలి వాన బీభత్సాలకు కొన్ని గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.



మనిషికి తగిలేలా కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు



తుప్పు పట్టి ప్రమాదకరంగా ఉన్న స్తంభం



స్తంభానికి బిగించాల్సిన వైర్లు కట్టెకు కట్టిన దృశ్యం

● కంచె ఏర్పాటు చేయాలి

ప్రతీ ఏడాది పదుల సంఖ్యలో మూగ జీవాలు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోతున్నాయి. వేసవి, వర్షాకాలం ప్రారంభంలో మూగజీవాలు మేత కోసం బయటకు వెళుతున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడుతున్నాయి. ప్రమాదాలకు నెలవుగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా రైతులు వ్యవసాయ క్షేత్రాల్లోకి వెళుతున్న క్రమంలో గట్ల వెంట రహదారుల పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండటంతో ఏ ప్రమాదం వచ్చి పడుతుందో నని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి రక్షణ కంచెను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

● ఎత్తులో ఏర్పాటు చేయాలి

తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను ఎత్తుగా గద్దెలు నిర్మించి దానిపై ట్రాన్స్ ఫార్మర్లు బిగించాలి. విద్యుత్ ఘాతం నుంచి మూగ జీవాలను కాపాడుకునేలా, విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లను పునరుద్దరణ పనులు చేపట్టాలి. - సాయిలు, రైతు



రక్తదానం చేస్తున్న తోట రాజశేఖర్ తదితరులు

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సమాజ సేవలో మమేకమై తమవంతుగా రక్తదానాన్ని చేయాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ బస్వారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత రక్తదానం విరివిగా చేయాలని అన్నారు. రక్తం దానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాన్ని కాపాడవచ్చునని అన్నారు. రాజశేఖర్ 82వ సారి రక్తదానం చేయడంతో ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ అంజనేయులు, కోశాధికారి కరిపె రవీందర్, కార్యవర్గ సభ్యులు వెంకటకృష్ణ, రవీందర్, అరుణ్‌బాబు, వెంకటేశం, రాకేష్, గణేష్, సత్యనారాయణ, ధర్మేందర్, శ్రీకాంత్, శ్రీనివాస్, రక్తదాతలు సమియోద్దీన్, శిరీష్, సాయిప్రగతి, గణేష్, ప్రవళిక, మరో 20 మంది రక్తదానం చేశారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీపీఎం తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో రాష్ట్ర మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మూడు సంవత్సరాల కాలంలో ప్రజాసమస్యలపై జరిగిన ఉద్యమాలను సమీక్షించడంతో పాటు భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణలను ఈ రాష్ట్ర మహాసభలు నిర్ణయించడం జరుగుతుందన్నారు. ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గంగాధరప్ప, పెద్దివెంకట్రాములు, నూర్జహాన్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

● టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ డిమాండ్



సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): 23 రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీని అమలు చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. ఈనెల 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నాకు సమగ్ర శిక్షా ఉద్యోగులంతా తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ సీనియర్ నాయకులు తోట హన్మాండ్లు, టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్, ప్రధాన కార్యదర్శి అర్వింద్, సమగ్ర శిక్షా ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి భూపేందర్, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు రాజేందర్, తదితరులు పాల్గొన్నారు. 23వ రోజు సమ్మెలో భాగంగా మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ మహాసభలో జిల్లా నాయకులు



టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలో పాల్గొన్న జిల్లా నాయకులు

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నల్గొండలో మూడు రోజుల పాటు జరుగుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై మహాసభలో మాట్లాడారు. 317 జీవోను రద్దు చేయాలని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. పీఆర్‌సీని అమలు చేయాలని, సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మహాసభలో పాల్గొన్న రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. జిల్లాకు చెందిన రాష్ట్ర కార్యదర్శి సత్యానంద్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, గంగాధర్, ఉపాధ్యక్షులు మల్లేష్, రాజారాం, సాయన్న, ఆనంద్ మహాసభలో పాల్గొన్నారు.

ఉద్యోగిగా సేవలందించడం అభినందనీయం

ఖిల్లా, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ప్రభుత్వ ఉద్యోగిగా సేవలందించడం అభినందనీయమని జిల్లా పరిషత్ ముఖ్యకార్య నిర్వాహణాధికారి సాయగౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుబ్రహ్మణ్యం పదవి విరమణ మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యంను ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి సాయన్న, మండల అధికారులు పాల్గొన్నారు.

నేడు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో కలెక్టర్ సమావేశం

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, ఇతర జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సోమవారం జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం ఏర్పాటు చేసినట్లు డీఐఈవో రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 4గంటలకు కలెక్టరేట్‌లో జరిగే సమావేశానికి అందరూ ప్రిన్సిపాళ్లు హాజరుకావాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు మానసిక సంసిద్ధతను పెంపొందించడమే కాక విద్యార్థుల్లో యాంటీ డ్రగ్స్, ఆత్మహత్యల నిరోధానికి, విద్యార్థుల హాజరు పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, రానున్న వార్షిక పరీక్షల సంసిద్ధతపై ఈ సమీక్షలో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకనే అక్రమ కేసులు



కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి



జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన జనం

(ఐదో పేజీ తరువాయి)

పలికారు. జిల్లా కేంద్రంలోని ఎన్ఎఫ్ఎస్ చౌరస్తా వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళులర్పించి అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడారు. తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని దేనికి భయపడనని అన్నారు. పోరాటం చేసి రాష్ట్రాన్ని తీసుకొచ్చిన వాళ్లమని, గట్టిగా నిలబడి ప్రజల పక్షాన పోరాటం చేస్తామని పునరుద్ఘాటించారు. కేంద్రాన్ని ఎదురించి ప్రశ్నిస్తే బీజేపీ కేసులు పెడుతుందని, ఇక రాష్ట్రంలో అక్రమ కేసులపై చెప్పనవసరం లేదన్నారు. ముఖ్యమంత్రి పేరు మర్చిపోయినా.. రైతులు భూములు ఇవ్వకపోయినా... సోషల్ మీడియాలో ప్రశ్నించినా.. ప్రభుత్వాన్ని విమర్శించినా సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు కేసులు పెడుతున్నారని అన్నారు రాష్ట్రంలో పది సంవత్సరాలు పీపుల్స్ ఫ్రెండ్లీ పోలిసింగ్ పోయి ప్రస్తుతం కాంగ్రెస్ ఫ్రెండ్లీ పోలిసింగ్ వచ్చిందన్నారు. హామీల అమలులో రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని, గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులను, కార్మికులతో పాటు అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. గురుకులాలను నడపడానికి ప్రభుత్వానికి చేతకావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికే 57 మంది పిల్లలను పొట్టనపెట్టుకున్నారని అన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన మంచి పనులను ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏపీ సీఎం చంద్ర బాబు శిష్యుడని అందుకే తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతిపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ తల్లి స్థానంలో కాంగ్రెస్ మాతను ఏర్పాటు చేశారని అన్నారు. తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను మాయం చసి తెలంగాణ ఆడబిడ్డలను రేవంత్‌రెడ్డి అవమానించారని అన్నారు. 'తెలంగాణ తల్లి మాదిరా.. కాంగ్రెస్ తల్లి నీదిరా' అంటూ నినాదాలు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండేనని అన్నారు. బీఆర్ఎస్ సత్తా చాటి మరోసారి నిజామాబాద్ పవర్‌ను సీఎం రేవంత్‌రెడ్డికి చూపిద్దామన్నారు. అంతకుముందు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. హామీలు అమలు చేయలేని చేతకాని దద్దమ్మ రేవంత్‌రెడ్డి అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఖతం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఆట మొదలైందని కాంగ్రెస్, బీజేపీలను వెంటాడతామని అన్నారు. రాజకీయ కుట్రలో భాగంగానే అరెస్టులు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయడంలో విఫలైందని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. అనంతరం నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త మాట్లాడుతూ.. రాజకీయ దురుద్దేశంతోనే కవితను అరెస్టు చేశారని, ప్రజలందరూ బీఆర్ఎస్ వైపు ఉన్నారని కవితక్కను మళ్లీ భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేష్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, బోధన్ ఇన్‌చార్జి షకీల్ అయేషా ఫాతిమా, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఘన స్వాగతం పలకిన పార్టీ శ్రేణులు

లిక్కర్ కేసులో అరెస్టు అయి బెయిల్‌పై విడుదలై మొదటిసారి జిల్లా కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు గులాబీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. నగరంలోని బైపాస్‌రోడ్డు నుంచి భారీ ర్యాలీగా సభస్థలికి చేరుకున్నారు. ఎన్ఎఫ్ఎస్ చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున మహిళలు బోనాలు, బతుకమ్మలను ఎత్తుకొని కవితకు స్వాగతం పలికారు. ప్రాంగణం మొత్తం జై తెలంగాణ... జై కవితక్క నినాదాలతో మారుమోగింది. చంద్రశేఖర్ కాలనీ చౌరస్తా నుంచి ఎన్ఎఫ్ఎస్ చౌరస్తా వరకు డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

ఎమ్మెల్సీ కవితకు గజమాలతో పార్టీ శ్రేణుల స్వాగతం



టోల్‌గేట్ వద్ద గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

ఇందల్వాయి/డిచ్‌పల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మండలంలో టోల్‌గేట్ వద్ద ఆదివారం గజమాలతో పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. దాదాపు పది నెలల తర్వాత ఇందూరుకు వచ్చిన నేపథ్యంలో నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కవితక్క జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం టోల్‌గేట్ నుంచి ర్యాలీగా నిజామాబాద్‌కు బయలు దేరారు. అలాగే డిచ్‌పల్లిలో కవిత రాక సందర్భంగా టపాసులు పేల్చి సంబరాలు జరిపారు. మహిళలు కవితకు మంగళహారతులు ఇచ్చారు. జిల్లాకు వచ్చిన కవితకు చంద్రయాన్‌పల్లి నుంచి జిల్లా కేంద్రం వరకు ప్రధాన కూడళ్లతో స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ కవితను చూసేందుకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, నాయకులు పోతంగల్ కిషన్‌రావు, అయేషా ఫాతిమా, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, బాజిరెడ్డి జగన్ ఉన్నారు.

ఆత్మీయం.. అపురూపం

● 24 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు



మోడ్రన్ పబ్లిక్ స్కూల్ పూర్వవిద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఖలీల్‌వాడిలోగల మోడ్రన్ పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థుల కలయిక ఆత్మీయ అపురూపాలకు వేదికైంది. 1999-2000 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 24 సంవత్సరాల తర్వాత ఆత్మీయ వేడుకను నిర్వహించారు. నగర శివారులోని బైపాస్ రోడ్‌లోగల ఓ ఫామ్‌హౌజ్‌లో నిర్వహించిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం కన్నుల పండుగగా జరిగింది. 150 మంది పూర్వ విద్యార్థులు 24 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒకచోట కలవడంతో ఆ వేడుక ఆనందమయమైంది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా స్వాగతించి పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇంత సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ కలవడం ఆనందంగా ఉందన్నారు. ఉన్నత స్థానాల్లో ఉన్న విద్యార్థులను చూసి అభినందించారు. చిన్ననాటి అనుభూతులను మళ్లీ నెమరువేసుకోవడం ఆనందంగా ఉందని పూర్వవిద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు రవి, సాయిబాబా, బలవంతరావు, సాయిప్రసాద్, శకుంతల, విమల, అన్నపూర్ణ, శ్రీనివాస్, పశుపతి, సురేందర్, శర్మ, చిత్ర, పీ ఈ టీ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మానవ హక్కుల నేత మాధవరావు అంతిమయాత్ర



మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు



మాట్లాడుతున్న మండవ వెంకటేశ్వరరావు

(ఐదో పేజీ తరువాయి)

రామకృష్ణ, యోగానంద్, న్యూడెమోక్రసీ రాష్ట్ర, జిల్లా నాయకులు, మానవహక్కుల వేదిక నాయకుల ఆధ్వర్యంలో భౌతికకాయాన్ని అప్పగించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు వెంకటరామయ్య, మానవహక్కుల ఉమ్మడి తెలుగు రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు వి.ఎస్.కృష్ణ, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు భుజంగరావు, తిరుపతయ్య, వి.ప్రభాకర్, రామకృష్ణ, వి.కృష్ణ, దేవరాం, తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి ఘటించిన మాజీ మంత్రి మండవ..

మానవహక్కుల నేత గొర్రెపాటి మాధవరావు భౌతికకాయానికి మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. నగరంలోని ఎన్ఆర్‌భవన్‌లో ఉన్న మాదవరావు భౌతికకాయంపై మండవ వెంకటేశ్వరరావు పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొర్రెపాటి మాధవరావు మానవహక్కుల కోసం నాలుగు దశాబ్దాల పాటు అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. చిన్ననాటి నుంచే వామపక్ష భావజాలంతో ఉన్న మాధవరావు అక్రమాలను ఎదురించాడని అన్నారు. పోలీసుల అక్రమ అరెస్టులు, ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా వాదించిన న్యాయవాది అని అన్నారు. బతికినన్ని రోజులు ప్రజల పక్షాన నిలబడ్డారని అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మ టీచర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నిర్వహించారు. జిల్లా ప్రతినిధుల సమావేశానికి రాష్ట్ర కమిటీ బాధ్యులు నాగేశ్వర్‌రావు, రాజులు హాజరుకాగా వారి సమక్షంలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా గుమ్మడి చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెద్ది సుదర్శన్, జిల్లా ఉపాధ్యక్షులుగా గడ్డల రమేష్, మహిళా ఉపాధ్యక్షురాలిగా రాజమణి, జిల్లా కార్యదర్శులుగా సాయినాథ్, ప్రతాప్, కార్యవర్గ సభ్యులుగా మోహన్, పోశన్న, శంకర్, రాజన్న, మోహన్, వినోద్, సుధాకర్, సురేష్, రాజ్‌కుమార్‌లు ఎన్నికయ్యారు. జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపారు.

విశ్వహిందూ పరిషత్‌లో పలువురి చేరిక

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ భజరంగ్‌దళ్ హైందవ సనాతన ధర్మం కోసం చేస్తున్న సేవలకు ఆకర్షితులై యువకులు విశ్వహిందూ పరిషత్ భజరంగ్‌దళ్‌లో చేరుతున్నట్లు జిల్లా అధ్యక్షుడు దినేష్‌ఠాకూర్ అన్నారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు యువకులకు కండువా కప్పి సంస్థలోకి ఆహ్వానించారు. జిల్లా కార్యదర్శి దయానంద్, ఉపాధ్యక్షుడు ఆనంద్, జిల్లా సహకార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యానికి సహజయోగా అవసరం

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతీరోజు ఆనందమయ ఆరోగ్యకరమైన జీవితానికి సహజ యోగా అవసరమని తెలంగాణ రాష్ట్ర సహజయోగా సమన్వయకర్త కృష్ణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన సహజయోగా ధ్యాన అవగాహన చైతన్య రథయాత్ర ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ప్రజల్లో సహజయోగా ధ్యానంపై అవగాహన కల్పించడానికి రథయాత్రను నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆర్మూర్, నందిపేట్, తదితర 50 గ్రామాల వరకు ప్రజల్లో ధ్యానం యోగా వల్ల ఎలాంటి ఉపయోగం ఉంటుందో తెలియజేశాన్నారు. ప్రతీరోజు యోగా, ధ్యానం ద్వారా జీవితాలు ఎలా ఆనందమయం, సుఖమయం, ఆరోగ్యప్రథం చేసుకోవచ్చో వివరించడం జరిగిందని అన్నారు. సహజయోగా, ధ్యానం వల్ల మన శరీరంలోని వెన్నుముఖ దిగువభాగాన ఉన్న త్రికోణాకారపు ఎముకలో నిద్రాన స్థితిలో ఉన్న కుండలీ శక్తిని జాగృతి చేసి దానిని పరమాత్మ రూపమైన పరమచైతన్య శక్తికి అనుసంధానం చేయడం ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పూర్వ సమన్వయ కర్త సుబ్బిరెడ్డి, మెంబర్స్ వినోద్, పండిత్ సుబ్రహ్మణ్యం, జిల్లా సమన్వయకర్త నాగభూషణాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాలమల్లయ్య జాతర

సిరికొండ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూర్ గ్రామ సమీపాన గల పాలమల్లయ్య జాతర సందర్భంగా ఆదివారం భక్తులు కొండూర్ నుంచి బోనాలను డప్పుల సప్పుళ్ల మధ్య మహిళలు ఊరేగింపుగా తీసికెళ్లారు.. పీసర గుట్ట వద్ద గల పాలమల్లయ్యకు బోనాలను సమర్పించారు. ఉత్సవాలకు హాజరైన భక్తుల కోసం యాదవ సంఘ సభ్యులు అన్నదానం చేశారు. భక్తులు అగ్ని గుండంలో నుంచి నడిచారు. ఈ ఉత్సవాలకు కొండూర్ గ్రామానికి చెందిన వారితో పాటు రామడుగు, హొన్నాజిపేట్ నుండి భక్తులు హాజరయ్యారు.

శబరిమలకు అయ్యప్ప మాలధారులు

సిరికొండ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్కోల్‌కు చెందిన అయ్యప్ప మాలధారులు ఆదివారం గడ్కోల్ నుంచి శబరిమలైకి బయలుదేరారు. అయ్యప్ప మాలధారులు ఇరుముడిలను నెత్తిన ఎత్తుకుని అయ్యప్ప దర్శనం కోసం శబరిమలై వెళ్లారు.

పకడ్బందీగా ఇందిరమ్మ సర్వే

ధర్పల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బాలకృష్ణ తెలిపారు. మండలంలో ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం 9వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలో అత్యధికంగా 2000 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఆయా గ్రామాల్లో ముమ్మరంగా కొనసాగుతుందని రెండు మూడు రోజుల్లో సర్వే పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. సర్వే చేసిన జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నట్లు ఆయన తెలిపారు.

సర్వర్ రాక ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఆలస్యం

సిరికొండ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వే గడువు ముగుస్తుండడంతో అధికారుల్లో ఆందోళన మొదలయ్యింది. మండలంలో ఇంటర్‌నెట్ రాక సర్వర్ సమస్యలు ప్రారంభమయ్యాయి. పంచాయతీ కార్యదర్శులు, కారోబార్‌లు ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్నా రోజుకు పది, ఇరువై ఇళ్లు కూడా పూర్తి కావడం లేదని వాపోతున్నారు. సోమవారంతో సర్వే గడువు ముగుస్తుండడంతో అధికారులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజా పాలనలో పదివేల 13 మంది దరఖాస్తులు చేసుకోగా ఆదివారం నాటికి 65 నుంచి 70 శాతం వరకు మాత్రమే సర్వే పూర్తయ్యిందని అధికారులు చెపుతున్నారు.

చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.160	రూ.275	రూ. 295
వెన్‌కాబ్ (కిలో)	: రూ.165	రూ.280	రూ. 300



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్ (10 గ్రా.)	వెండి (10 గ్రా.)
రూ.79000	రూ.72900	రూ.925

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : పుష్ప-2 (11.10, 3.15)
: మ్యాక్స్ (7.20)
: ముఫాసా (ఇంగ్లీష్ 3డి) (10.15)
స్క్రీన్-2:ముఫాసా (తెలుగు 3డి) (10.30, 1.20, 7.30)
:బారోజ్ (తెలుగు 3డి) (4.10): పుష్ప-2 (10.20)
స్క్రీన్-3 : బేబిజాన్ (హిందీ) (11.00, 10.40)
: పుష్ప-2 (హిందీ) (2.30)
: పుష్ప-2 (తెలుగు) (6.35)
స్క్రీన్-4 : మ్యాక్స్ (10.30, 10.50)
: డ్రింకర్ సాయి (1.25)
: శ్రీకాకుళం షేర్‌లాక్‌హోమ్స్ (4.35)
: బేబిజాన్ (హిందీ) (7.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మ్యాక్స్ (10.40, 1.30)
: శ్రీకాకుళం షేర్‌లాక్‌హోమ్స్ (4.30)
: పుష్ప-2 (7.00)
:బేబిజాన్ (హిందీ) (10.30)
స్క్రీన్-2 : ముఫాసా
(11.00, 1.35, 10.10)
: పుష్ప-2 (4.00)
: యుఐ (7.30)
స్క్రీన్-3 : పుష్ప-2 (1.20, 10.00)
: ముఫాసా
(తెలుగు 3డి) (5.00, 7.30)

దేవి : ముఫాసా (11.00, 2.00, 6.00, 9.00)
నటరాజ్ : మ్యాక్స్ (11.00, 2.00, 6.00, 9.00)
విజయ్: పుష్ప-2 (10.00, 2.00, 6.00, 10.00)
లలితామహాల్: యుఐ (11.15, 2.15)
: విడుదల-2 (6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్